సాక్షి
కాకినాడ

శనివారం । 13 । జనవరి । 2024



అన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి అన్నదాన పథకానికి ఇందుకూరి రామ కోటేశ్వరరాజు (భీమవరం) రూ.2,21,200 విరాళంగా అందజేశారు.



రాత బాగుంటే మార్కుల పంటే!

పరీక్షల్లో ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో, చేతిరాత కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

II లో

8,650 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

దేశాభివృద్ధిలో పర్యాటకం కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న అజిత్ కుమార్ శర్మ

కాకినాడ: దేశ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధిలో పర్యాటక రంగం ముఖ్య భూమిక పోషిస్తోందని గుజరాత్ రాష్ట్ర పర్యాటక శాఖ అధికారి అజిత్ కుమార్ శర్మ అన్నారు. పర్యాటక రంగం ఎంత అభివృద్ధి చెందితే దేశ ఆర్థిక వ్యవస్థ అంతగా బలపడుతుందని చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధిపై స్థానిక రాయల్ పార్కులో శుక్రవారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. పర్యాటకంగా గుజరాత్ సాధించిన ప్రగతిని తెలియజేస్తూ రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. ప్రధాని మోదీ తీసుకున్న సాహసోపేత చర్యల వల్ల తమ రాష్ట్రం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ సెమినార్‌లో ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పర్యాటక అధికారులు, టూర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

21న జాతీయ బాలికల సైన్స్ పోటీలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ నాగమణి తదితరులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రామచంద్రపురానికి చెందిన రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 21న జాతీయ స్థాయి సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల వాల్ పోస్టర్‌ను పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యా శాఖ అధికారి జి.నాగమణి శుక్రవారం ఆవిష్కరించారు. బాలికల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. ఆ రోజు ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకూ విద్యార్థినులకు రామచంద్రపురంలో సైన్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి మాట్లాడుతూ, సైన్స్ వినోదం, భౌతిక శాస్త్ర వినోదం, గణిత వినోదం ప్రయోగాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనికి ఎటువంటి రుసుం లేదన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థినులు ఈ నెల 14వ తేదీలోగా గూగుల్ ఫామ్‌లో 'హెచ్‌టీటీపీఎస్://బిట్.ఎల్‌వై/రేవతిసైన్స్‌అవార్డ్స్2024'లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామానుజన్ గణిత అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కేవీపీ సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మలో ధైర్యం నింపిన త్రిజట స్వప్నం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'అకాలో దుర్లభో మృత్యుః' అని పండితులు చెబుతారని, కాని కాలంలో మృత్యువు కూడా కరుణించదని సీతమ్మ భావిస్తుందని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో శ్రీరామాయణం 31వ రోజు ప్రవచనాన్ని శుక్రవారం ఆయన కొనసాగించారు. రావణుని హెచ్చరికలు, రాక్షస కాంతల బెదిరింపులతో సీతమ్మ తల్లి ఆలోచన పరిపరివిధాల పోయిందన్నారు. 'నా కన్నీటి చుక్కలు రామబాణాలుగా మారి, రావణుని అంతం చేయక మానవు. రామబాణాలకు ఈ సాగరం ఒక అడ్డంకి కాదు. అయినా రాముడు నన్ను ఎందుకు ఆదుకోవడం లేదు? రాముడు రాజర్షి. ఆయనకు నాతో పని లేదనుకోవాలా? రావణుడు కపటోపాయంతో ఆయనను వధించాడా.. అని సీతమ్మ ఆలోచిస్తున్న తరుణంలో.. త్రిజట తన స్వప్న వృత్తాంతాన్ని రాక్షస కాంతలకు చెబుతుంది. రాముని విజయం, రావణుని పరాజయం, సీతారాముల పునస్సమాగమం ఈ కలలో నాకు కనపడిందని చెబుతుంది. ఇది విన్న సీతమ్మలో ధైర్యం, రాక్షస స్త్రీలలో భయం కలుగుతాయి. సీతాదేవిని శరణు కోరితే, మహా భయాల నుంచి విముక్తి కలుగుతుంది. మహా భయమంటే సంసారమే' అని సామవేదం అన్నారు. స్వప్న శాస్త్రమంటే మన వాళ్లు ఫ్రాయిడ్ పేరు చెబుతారని, అంతకు ముందే ఆత్రేయ మహర్షి ఈ శాస్త్రాన్ని మనకు అందించారని చెప్పారు. అలాగే, ఆర్థిక శాస్త్రమంటే ఆడమ్ స్మిత్ అంటారని, అంతకు వేల సంవత్సరాలకు ముందే కౌటిల్యుడు అర్థశాస్త్రాన్ని మనకు అందించాడని తెలిపారు. భారతీయులకు శాస్త్ర స్పృహ తప్ప అన్ని శాస్త్రాలూ ఉన్నాయని అన్నారు. స్వప్నాలను బట్టి రోగాలను నిర్ధారించడం కూడా ఉందని, శాస్త్రాల పట్ల నిర్లక్ష్య ధోరణి తగదని హితవు పలికారు. చెడు విన్నా, చూసినా దోషం కలుగుతుందని, ఆ దోషాన్ని పరిహరించే గుణం దూర్వానికి ఉందని చెప్పారు. అందువల్లనే రావణుడు మాట్లాడే సమయంలో సీతాదేవి దూర్వాన్ని అడ్డు పెట్టుకుంటుందని సామవేదం అన్నారు.



అన్నదాతల లోగిళ్లలో..
ఆనంద సంక్రాంతి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

వరి సాగు విస్తీర్ణం	:	2,04,438 ఎకరాలు
ధాన్యం కొనుగోలు లక్ష్యం	:	2,61,000 మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసినది	:	1,46,628 మెట్రిక్ టన్నులు
విక్రయించిన రైతులు	:	27,377 మంది
వారికి చెల్లించాల్సింది	:	రూ.320.09 కోట్లు
ఇప్పటి వరకూ చెల్లించినది	:	రూ.271.06 కోట్లు
ఇంకా చెల్లించాల్సింది	:	రూ.49.03 కోట్లు
తడిసి, రంగు మారిన ధాన్యం కొనుగోలు	:	18,211 మెట్రిక్ టన్నులు
కొనుగోలుకు చివరి తేదీ	:	15.03.2024

- తుపాను వేళ తడిసిన ధాన్యం సైతం కొన్న రాష్ట్ర ప్రభుత్వం
- అన్నదాతల ఖాతాల్లో ముందుగానే డబ్బుల జమ
- సీఎం చొరవతో చేతిలో దండిగా సొమ్ము
- నష్టం లేకుండా గట్టెక్కిన రైతులు
- ఇంటింటా ఆనంద కాంతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రైతుల లోగిళ్లలో సంక్రాంతి శోభ ఉట్టి పడుతోంది. ధాన్యం విక్రయించిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం కాస్త ముందుగానే జమ చేయడంతో.. ఈ పండగ వేళ వారి చేతిలో సొమ్ము ఆడుతోంది. తడిసి, ముద్దయి, రంగు మారిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయడంతో గట్టెక్కిన రైతులు సంతోషంగా కనిపిస్తున్నారు. రాష్ట్రానికి ధాన్యాగారంగా పేరొందిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏ మూల ఏ పల్లెలో చూసినా అన్నదాతల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది.

చి'వరి'లో ముంచిన మిచాంగ్

ఉమ్మడి జిల్లాలో 70 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. సంక్రాంతి పండగ వేళ పట్టణాలు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బంధుమిత్రులతో రైతులు, వ్యవసాయ కూలీల ఇళ్లు కళకళలాడుతూ ఉంటాయి. వచ్చిన వారికి మర్యాదలు చేయడంలో ఎక్కడా లోటు రాకుండా చూసుకోవడానికి ఇక్కడి వారు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. కొత్త అల్లుళ్లు, బంధుమిత్రుల కోసం పిండి వంటలు తయారు చేస్తారు. కొత్త దుస్తులు కొనుగోలు చేస్తారు. ఏటా సంక్రాంతి ముందు ఇదంతా జరిగేదే. అయితే ఇవన్నీ అనుకున్నది అనుకున్నట్టు జరగాలంటే ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట సొమ్ము సకాలంలో చేతికి రావాలి. మునుపెన్నడూ లేని రీతిలో గడచిన ఖరీఫ్ చివరిలో సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి మిచాంగ్ తుపానుతో పంటలకు నష్టం వాటిల్లింది. ముందుగానే నాట్లు వేసుకున్న మండపేట, రామచంద్రపురం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్ తదితర నియోజకవర్గాల్లోని రైతులు తుపాను గండం నుంచి తప్పించుకుని, గట్టెక్కారు. కోనసీమ ప్రాంతంలోని మండలాలు, కాకినాడ జిల్లాలోని కాకినాడ రూరల్, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట తదితర నియోజకవర్గాలతో పాటు తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా నాట్లు పడ్డాయి. ఆ పంటలకు మిచాంగ్ తుపానుతో నష్టం వాటిల్లింది. చేలల్లో, కళ్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యాన్ని చూసి రైతుల గుండెలు బరువెక్కాయి. ఈ నేపథ్యంలో ఈసారి సంక్రాంతి పండగ నిర్వహించుకోవడం కష్టమవుతుందని బెంగ పెట్టుకున్నారు.

రైతుకు మేలు చేసిన సీఎం జగన్

ఖరీఫ్ రైతులు కష్టాల్లో చిక్కుకున్నారని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. తుపానుకు పంటలు నష్టపోయిన రైతులందరికీ మేలు చేసేలా తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసేలా విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా తుపాను వర్షాలకు తడిసి ముద్దయి, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనలు సడలించి మరీ కొనుగోలు చేసింది. అంతేకాకుండా వారం తిరగకుండానే పలువురు రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేసింది. ఆ రోజు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం.. ఈ పండగ వేళ తమ ఇళ్లల్లో ఆనంద సంక్రాంతి తీసుకువచ్చిందని రైతు కుటుంబాలు చెబుతున్నాయి.

పండగకు ముందే డబ్బులేసేశారు



గతంలో ఎన్నడూ లేని విధంగా గడచిన ఖరీఫ్‌లో నేను 4 ఎకరాల్లో సాగు చేసిన పంట దిగుబడి బాగా వచ్చింది. తీరా కోత కోసే సమయానికి తుపాను రావడంతో బాగా నష్టపోతున్నామని భయపడ్డాను. ఇక దేవుడే దిక్కు అని అనుకున్న సమయంలో ముఖ్యమంత్రి జగన్ రైతుల పట్ల సానుభూతితో స్పందించారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయించారు. అలా నేను రైతు భరోసా కేంద్రంలో 120 బస్తాల ధాన్యం అమ్మాను. రెండు రోజుల్లోనే పంట సొమ్ము చేతికి అందింది. ప్రభుత్వం చొరవ తీసుకుని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా సకాలంలో సొమ్ములు కూడా జమ చేసింది. అందుకే ఈ సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోవడానికి అవకాశం చిక్కింది.

– వెలమర్తి బుల్లిరాజు, రైతు, వెంకట కృష్ణరాయపురం, సామర్లకోట



సంక్రాంతి దగ్గర పడటంతో ఉప్పలగుప్తంలో గుమ్మంలో ఉన్న ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

సంతోషంగా సంక్రాంతి సంబరాలు

- మంత్రి దాడిశెట్టి రాజా ఆకాంక్ష
- కోలాహలంగా ముందస్తు వేడుకలు

తుని: సంక్రాంతి పండగను ప్రజలందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆధ్వర్యాన రాజా కళాశాల మైదానంలో తుని నియోజకవర్గ సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రాజా ఈ సంబరాలను ప్రారంభించారు. మైదానంలో ఏర్పాటు చేసిన భోగి మంటను వెలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొడుకులు, కోడళ్లు, బంధువుల సందడితో సంప్రదాయ పద్ధతిలో పండగను ఆనందంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గంగిరెద్దులు, హరిదాసు, ఎడ్లబండి, రంగవల్లికలు, గాలిపటాలు, నృత్యాలు అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సూర్య భగవానుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కౌన్సిలర్లు కట్టెల పొయ్యిపై పొంగలి వండి అందరికీ పంచారు. రంగవల్లికల పోటీల్లో 100 మంది మహిళలు పాల్గొని, సంక్రాంతి ప్రాధాన్యాన్ని చాటి చెప్పేలా ముగ్గులు వేసి, అందరి మన్ననలూ పొందారు. విజేతలకు చైర్‌పర్సన్ సుధారాణి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



భోగి మంట వెలిగిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



సూర్య భగవానుడికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, కౌన్సిలర్లు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గంగిరెద్దు, హరిదాసు

19న 'నవ్య'

- జీజీహెచ్‌కు టాటా మెమోరియల్ ఆసుపత్రి బృందం రాక
- ఏర్పాట్లు పరిశీలించిన సూపరింటెండెంట్

కాకినాడ క్రైం: క్యాన్సర్ బాధితుల సంజీవని 'నవ్య' కార్యక్రమాన్ని జీజీహెచ్ క్యాన్సర్ వార్డులో ఈ నెల 19న నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, క్యాన్సర్ బాధితుల స్వచ్ఛంద సంస్థ నవ్య, టాటా మెమోరియల్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రతిష్టాత్మక క్యాన్సర్ కేంద్రాల్లో సేవలందిస్తున్న నిష్ణాతులైన వైద్యుల మార్గదర్శకత్వంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆన్‌లైన్ ద్వారా జీజీహెచ్ వైద్యులు స్థానిక రోగులకు వైద్య సేవలు అందించనున్నారు. అదే రోజు క్యాన్సర్ వార్డులో నవ్య ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు కానుంది. 'నవ్య' బృందం పర్యటన ఏర్పాట్లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి శుక్రవారం పర్యవేక్షించారు. వార్డులు, ఓపీ విభాగాల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. క్యాన్సర్ వార్డులో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అంకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసన్ వివరించారు. కీమోథెరపీ సేవలు అందిస్తున్న క్యాన్సర్ వార్డు నర్సులను పరిచయం చేశారు. హోమీ బాబా టాటా మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహాన్ శెట్టి, డీఎంఈ డాక్టర్ నరసింహం సహా ప్రముఖులు నవ్య ప్రారంభోత్సవానికి రానున్నారని డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. సూపరింటెండెంట్ వెంట ఆర్‌ఎంఓ డాక్టర్ రాహుల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రదీప్, నరసింహులు తదితరులు ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ల ఆరోగ్య సేవల కోసం ఇప్పటికే జీజీహెచ్‌లో ఉన్న టీజీ హెల్ప్ డెస్క్‌కు అదనంగా 14వ నంబరు వార్డు సమీపంలో కేటాయించిన ప్రత్యేక గదిని డాక్టర్ లావణ్య కుమారి ప్రారంభించారు.



క్యాన్సర్ వార్డులో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసన్

165 వలంటీర్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

కాకినాడ సిటీ: జిల్లావ్యాప్తంగా 165 గ్రామ వలంటీర్ ఖాళీల భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి తెలిపారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని, అనంతరం ఎంపీడీఓల ఆధ్వర్యాన ఉండే కమిటీ ద్వారా మౌఖిక పరీక్ష నిర్వహించి, అర్హులైన వారిని వలంటీర్లుగా ఎంపిక చేస్తారని వివరించారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందడుగు



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు


- కలెక్టర్ కృతికా శుక్లా
- వేడుకగా సామాజిక సమతా సంకల్పం

కాకినాడ: అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో రూ.400 కోట్లతో 125 అడుగుల ఎత్తయిన కాంస్య విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేసిందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న ప్రారంభించనున్నారని, ఈ నేపథ్యంలో అంబేడ్కర్ సేవలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఈ నెల 18 వరకూ ప్రభుత్వ పరంగా పలు వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యాన ఇంద్రపాలెం వంతెన వద్ద ఉన్న అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి కలెక్టర్ కృతికా శుక్లా, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కాడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు తదితరులు శుక్రవారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రాజ్యాంగానికి కట్టుబడి అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతామని ఆర్పీలు, సీఓలు, మెప్మా సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలెక్టర్, ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మానవ హారంగా ఏర్పడి, కలెక్టరేట్ వరకూ మారథాన్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక సమతా సంకల్పం పేరిట అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించడంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ, దేశంలోనే ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటవుతోందని అన్నారు. అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తికి అనుగుణంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కమిషనర్ నాగనరసింహారావు మాట్లాడుతూ, కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించడం, సంతకాల సేకరణతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాత బాగుంటే మార్కుల పంటే!

- దస్తూరీ సాధన చేస్తే మంచిదంటున్న నిపుణులు
- టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఆసన్నమైన సమయం



అందమైన చేతిరాత

రాయవరం: పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇప్పటికే బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశాయి. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల వార్షిక పరీక్షలు మరికొద్ది నెలల్లో రానున్నాయి. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకుని చదవడం ప్రారంభించారు. విద్యాశాఖ అధికారులు కూడా ప్రత్యేక ప్రణాళికను పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. పరీక్షల్లో ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో, చేతిరాత కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చేతిరాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు. దస్తూరీ బాగా లేకుంటే..సమాధానం అర్థంకాక ఒక మార్కు, లేదా అర మార్కు అయినా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావం టోటల్ మార్కులపై పడుతుంది. అందువల్ల విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. విద్యార్థులు రోజుకు అరగంట అయినా చేతిరాతపై సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

మార్కుల సాధనకు చేతిరాత కీలకం

మన చేతిరాతను బట్టి కూడా మన మనస్తత్వాన్ని, గుణగణాలను కూడా అంచనా వేయవచ్చునని నిపుణులు చెబుతారు. పరీక్షల్లో చేతిరాత కీలకంగా మారుతుంది. అందంగా రాసే అక్షరాలకు వచ్చే అదనపు మార్కులే మంచి ఫలితాలు అందిస్తాయి. పరీక్షల్లో ఫలితాన్ని, భవితను నిర్దేశించేది అందమైన అక్షరాలేనని విషయ నిపుణులు పేర్కొంటున్నారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు, గ్రేడులు సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటారు. చేతిరాత గురించి మాత్రం పట్టించుకోరు. దీంతో అనుకున్న మార్కులు పొందలేక పోతుంటారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంచుకుంటే మంచి రాత వస్తుంది.

జిల్లా వ్యాప్తంగా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 70వేల మంది విద్యార్థులు వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. లక్ష మందికి పైగా విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఏడాదంతా చదివినది పేపరుపై పెట్టే సమయం సమీపిస్తోంది. చేతిరాత బాగుంటే విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. పరీక్షల సమయంలో ఇటు సబ్జెక్టులకు సన్నద్ధం అవుతూ మరోవైపు రోజులో కొంత సమయం చేతిరాతపై దృష్టి సారిస్తే పట్టు వస్తుంది.

ఇవీ సూచనలు

- ప్రతి విద్యార్థి జవాబు పత్రాల బుక్‌లెట్‌లో సమాధానాలు స్పష్టంగా రాయాలి.
- నాలుగు వైపులా మార్జిన్లు(బార్డర్లు) వేసుకుంటే మంచిది.
- ఒక లైనుకు మరో లైనుకు సెంటీమీటర్ గ్యాప్ ఇవ్వాలి.
- అక్షరాలు మరీ పెద్దవి, చిన్నవిగా ఉండకూడదు. పేపరంతా ఒకే స్థాయిలో అక్షరాలు ఉండాలి.
- గుండ్రంగా, అందంగా రాస్తే మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.
- గొలుసులా అక్షరాలను రాస్తే మంచి మార్కులు వచ్చే అవకాశం ఉండదు.
- బుక్‌లెట్‌లో వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి.
- బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వలన రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై కూడా పడుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తుంది.


చేతిరాత ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థి

ప్రత్యేక శ్రద్ధ



దస్తూరీ అందంగా ఉండేలా విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నాం. చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. చేతిరాత అందంగా ఉంటే పేపరు వాల్యుయేషన్ చేసే టీచర్‌కు విద్యార్థిపై మంచి అభిప్రాయం ఏర్పడుతుంది.

– చిట్టినీడి నిరంజని, జెడ్పీహెచ్‌ఎస్, మామిడికుదురు, మామిడికుదురు మండలం

సాధనతోనే సాధ్యం



చక్కటి చేతిరాత రావాలంటే సాధనతోనే సాధ్యమవుతుంది. చేతిరాతను అభివృద్ధి చేసుకునేందుకు ప్రతీ రోజు కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. తొలి ప్రశ్న నుంచి చివరి ప్రశ్న వరకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.

– ఎం.చంద్రకళ, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, ఉచ్చిలి, ఆత్రేయపురం మండలం.

విద్యార్థులు సేవా తత్పరత కలిగి ఉండాలి


సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న ప్రగతి కళాశాల చైర్మన్ కృష్ణారావు

గండేపల్లి: విద్యార్థులు అకుంఠిత దీక్షతో బాటు సేవా తత్పరత కలిగి ఉండాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ, ప్రతిభ అలవరుచుకోవాలన్నారు. ప్రగతి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభించారు. డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

కరెంట్ తీగలు తగిలి వ్యక్తి మృతి


కాండ్రేగుల చెరువులోంచి బయటకు తీసిన కార్తీక్ మృతదేహం

జగ్గంపేట: మండలంలోని కాండ్రేగుల గ్రామంలో అడవి పందు లకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఒక వ్యక్తి మృతి చెందాడు. అయితే ఈ విషయం ఎవరికీ తెలియకూడదని ఏకంగా అతని మృతదేహాన్ని చెరువు ఊబిలో కర్రలతో పాతి పెట్టేశారు. మృతుడు వెంట వెళ్లిన వ్యక్తులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు అందించిన వివరాల ప్రకారం కాండ్రేగల గ్రామ శివారులో పొలాల వద్ద అడవిపందులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి కరెంట్ తీగలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి అర్ధరాత్రి వచ్చిన కుందేళ్ల వేటగాడు, ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మేకల కార్తీక్ (30)కు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కరెంట్ తీగలు అమర్చిన వ్యక్తులు కార్తీక్ మృతదేహాన్ని ఎవరికి అనుమానం రాకుండా చెరువులో పడేస్తే బయటకు తేలిపోతుందని చెరువులోని ఊబిలో కర్రల సాయంతో పాతేసారు. అయితే మృతుడు కార్తీక్ కూడా వచ్చిన అతని తమ్ముడు అజయ్, మరో వ్యక్తి ఈ విషయాన్ని గమనించి భయంతో అక్కడ నుంచి పారిపోయి జగ్గంపేట వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చేపట్టారు. దీంతో కార్తీక్ మృతదేహం బయటపడింది. మృతుడుకి భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. పొట్టకూటికోసం వచ్చి ఇలా మృత్యువాత పడడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. కరెంటు తీగలు అమర్చి, ఒక వ్యక్తి మృతికి కారణమైన వ్యక్తులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

17న అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో గల తిరుమల విద్యాసంస్థలలో ఐదు నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈనెల 17వ తేదీ ఉదయం 10.00 గంటలకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకొనే తల్లిదండ్రులు, విద్యార్థులు రాజమహేంద్రవరం క్యాంపస్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. తిరుమల ఈడీయూ. కామ్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విశాఖపట్నం క్యాంపస్‌లో జరిగే సదస్సుకు హాజరుకావాలనుకొనేవారు ఆ క్యాంపస్‌లో అదే తేదీన నేరుగా సంప్రదించవచ్చన్నారు. 2023లో ఐఐటీ/ఎన్ఐటీ/ఐఐఐటీ/బిట్స్‌లలో 646 మంది విద్యార్థులు సీట్లు సాధించారని, ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 233 మందిలో 14మంది ఎయిమ్స్‌లో సీట్లు సాధించారన్నారు.